క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుకను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల: వివాహం చేసుకోనున్న జంటకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పంపిన పెళ్లి కానుకను అందజేశారు. మంగళవారం మద్దినాయనపల్లిలో బి.రూపేష్, పి.రేవతిలకు బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, పట్టు బట్టలు, తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరిధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఈశ్వరయ్య, మధురెడ్డి, హరిరెడ్డి, జయదేవ్, రెడ్డెప్పరెడ్డి, తులసీరామ్ పాల్గొన్నారు.

వేగవంతంగా నాడు-నేడు పనులు



పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల: మండలంలో రెండో దశ నాడు-నేడు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. మంగళవారం పదిపుట్ల బైలు ఎంపీయూపీ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. హెచ్‌ఎం వెంకటాచలం, ఉపాధ్యాయులు ఉన్నారు.

న్యాయం చేయాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న బాధితురాలు సుశీల

తిరుపతి కల్చరల్: పిత్రార్జితంగా తమకు సంక్రమించిన భూమిని తన బాబాయ్ అక్రమంగా కాజేస్తున్నారని, అధికారులు స్పందించి తమ భూమిని ఇప్పించి న్యాయం చేయాలని దుర్గిపేరి గ్రామానికి చెందిన సుశీల విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏర్పేడు మండలం దుర్గిపేరి గ్రామంలో తమ ఉమ్మడి కుటుంబానికి 20 సెంట్ల భూమి ఉందని తెలిపారు. తమకు తమ బాబాయ్ సింగం సుగ్రీవరెడ్డికి పది సెంట్లు చొప్పున రావాల్సి ఉందన్నారు. అయితే తమ భూమిపై కన్నేసిన బాబాయ్ సదరు భూమిని తనకు విక్రయించాలని కోరారని తెలిపారు. తాము నిరాకరించడంతో దొంగ డాక్యుమెంటు సృష్టించి కాజేశారని ఆరోపించారు. అధికారులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని వాపోయారు.

అవకాశాలను అందిపుచ్చుకోండి



యూత్‌క్లబ్ సభ్యులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

చంద్రగిరి(తిరుపతి రూరల్): యువత అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని చంద్రగిరి ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చంద్రగిరి ఎంపీడీఓ కార్యాలయంలో తిరుపతి సెట్విన్ ఆధ్వర్యంలో పనపాకం యూత్ క్లబ్ సభ్యులకు యూత్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకే ఈ క్లబ్ ఏర్పాటు చేశామని ఎంపీపీ తెలిపారు. సిల్క్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, సెట్విన్ అధికారులు శిరీష, కృష్ణారెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

నారాయణవనం: పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తున్నామని, ఈ కారణంగా మధ్యాహ్నం 1.30 గంటల తరువాత భక్తులను స్వామి దర్శనానికి అనుమతిస్తామని ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ. ఈనెల 31 నుంచి జూన్ 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్ఈ కృష్ణారెడ్డి

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలి వద్ద పామోలిన్ ట్యాంకర్ ఢీకొన్న 33 కేవీ లైన్ ప్రాంతాన్ని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ప్రమాదానికి కారణాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 33 కేవీ లైన్ ఏర్పాటుకు అయ్యే ఖర్చును అంచనా వేయాలని, బుధవారం నుంచి పనులు ప్రారంభించాలని ఎస్పీడీసీఎల్ డీఈ వాసురెడ్డికి సూచించారు.

చల్లంగ చూడు గంగమ్మ

- తాతయ్యగుంట ఆలయానికి పోటెత్తిన భక్తులు
- అమ్మవారికి పొంగళ్ల సమర్పణ
- ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన గంగమ్మ



భక్తులతో కిటకిటలాడుతున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయం

తిరుపతి కల్చరల్: చల్లంగ చూడు తల్లీ అంటూ భక్తజనం మంగళవారం శ్రీతాతయ్యగుంట గంగమ్మకు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతి గంగజాతర తర్వాత ఐదు మంగళవారాలు గంగమ్మకు భక్తులు మరు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. తొలి మంగళవారం కావడంతో వేకువజాము నుంచే ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి పొంగళ్లు పెట్టారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారి మూలవిరాట్టు విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. జాతరలో వేషాల మొక్కులు చెల్లించని భక్తులు వివిధ వేషాలతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. మరికొందరు భక్తులు వేయికళ్ల దుత్తలు నెత్తిన పెట్టుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈఓ ఎం.మునిక్రిష్ణయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేషాలతో గంగమ్మకు మొక్కులు

రాయలసీమ రంగస్థలి కళాకారులు వివిధ వేషాలు ధరించి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నా రు. అనంతరం భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ..రంగస్థలి ఆధ్వర్యంలో ఐదు వారాల పాటు కళాకారులు వివిధ వేషాలు ధరించి గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రంగస్థలి కార్యదర్శి కేఎస్.రాజా, పొన్నాల జేజిరెడ్డి, చెంగారెడ్డి, టి.సుబ్రమణ్యంరెడ్డి, దీపు, హేమంత్ మనిసుబ్రమణ్యం, శాంబోలు హరినాథ్ పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



వేయికళ్ల కుండలతో ఆలయ ప్రదక్షిణలు





వివిధ వేషాలతో గంగమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న రంగస్థలి కళాకారులు, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు,



పొంగళ్లు పెడుతున్న మహిళలు

గంగమ్మకు బోణాల సమర్పణ



ప్రత్యేకాలంకరణలో తిరుపతి గంగమ్మ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్టమీద వెలసిన తిరుపతి గంగమ్మకు భక్తులు బోణాలు సమర్పించారు. మంగళవారం వేకువజామున అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారికి బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామ దేవతకు అంబలి సమర్పణ



గంగమ్మకు అంబలి సమర్పిస్తున్న గ్రామస్తులు

పాకాల: మండలంలోని చెన్నుగారిపల్లె గ్రామ దేవత గంగమ్మకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని వేడుకుంటూ అంబలి సమర్పించారు. మహిళలు అమ్మవారికి సారె సమర్పించి కోర్కెలు నెరవేరాలని వేడుకున్నారు. కొందరు భక్తులు పొంగళ్లు పెట్టి ప్రసాదంగా పంపిణీ చేశారు.

మహిళా పోలీసుల సేవలు ప్రశంసనీయం

- మేయర్ శిరీష, కమిషనర్ హరిత
- జాతర విజయవంతానికి సహకరించిన వారికి ప్రశంసా పత్రాలు



మహిళా పోలీసుకు సర్టిఫికెట్ అందజేస్తున్న మేయర్ శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి తుడా: అత్యంత వైభవోపేతంగా నిర్వహించిన తిరుపతి గంగమ్మ జాతర ఉత్సవాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శుల సేవలు ప్రశంసనీయమని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత అన్నారు. గంగమ్మ జాతరలో విధులు నిర్వహించిన మహిళా సంరక్షణ కార్యదర్శులకు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. వార్డు సచివాలయాల్లోని మహిళా సంరక్షణ కార్యదర్శులు 61 మందికి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణలతో కలిసి ప్రశంసాపత్రాలను ఇచ్చారు. మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళా పోలీసులు తమకు కేటాయించిన విధులను చక్కగా నిర్వహించారని కొనియాడారు. ఆలయ పరిసరాల్లో సేవలందించడం మొదలుకొని కళా బృందాలు, ప్రజలను సమన్వయం చేసుకుని గంగ జాతర విజయానికి దోహదపడ్డారన్నారు. గంగమ్మ రాష్ట్ర పండుగగా ప్రకటించిన మొదటి జాతరను ఇంటింటికీ తీసుకెళ్లడమే కాకుండా, ప్రజల నరనరాల్లోకి ఎక్కించేలా జాతరను అద్భుతంగా జరిపించేలా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ఆలోచన, తపనను అధికారులు, సిబ్బంది ఆచరించి విజయవంతం చేశారన్నారు. సెట్విన్ ఆధ్వర్యంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కళా బృందాలు నగరంలో అన్ని వైపులా తిరుగుతూ ప్రజలను జాతర వైపు మళ్లించడం జరిగిందన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ తరుపున గంగజాతరకు కావాల్సిన శానిటేషన్, నీటి సౌకర్యం, వంటివి కల్పించామన్నారు. సెట్విన్ సీఈఓ మురళీ, స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్.కె.బాబు, తమ్ముడు గణేష్, కార్పొరేటర్ నరేంద్రనాథ్, అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ పి.రవి పాల్గొన్నారు.

● అమ్మవారికి పొంగళ్లు



పాకాల మండలం జింకలమిట్ట గ్రామంలో గంగ జాతర సందర్భంగా మంగళవారం స్థానికులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నప్రసాదాలు పంచిపెట్టారు. పట్టణాల్లో ఉన్న వారంతా బంధు మిత్రులతో స్వగ్రామానికి చేరుకోవడంతో సందడి నెలకొంది.

- పాకాల

గంగమ్మకు మోహిత్ రెడ్డి సారె



అమ్మవారికి సారె తీసుకెళ్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీ అంబేడ్కర్ కాలనీ, వెంకటపతి నగర్ పంచాయతీల్లో మంగళవారం జరిగిన గంగమ్మ జాతరలో చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సందడి చేశారు. తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలు తీసుకెళ్లి జాతర జరిగే గ్రామాల్లో సమర్పించారు. అమ్మవారికి పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నేతలు లోకనాథ రెడ్డి, సర్పంచ్ చిన్ని యాదవ్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

భాకరాపేట ముత్యాలమ్మకు సారె సమర్పణ

భాకరాపేట: ముత్యాలమ్మ జాతరను పురస్కరించుకుని అమ్మవారికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సారెను సమర్పించారు. ఏటా నిర్వహించే జాతరలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సారె తీసుకురావడం ఆనవాయితీ. ఈ ఏడాది ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సునీత, సర్పంచ్ భూపాల్, నేతలు మనోహర్, గురుశంకర్, మధు, దాము, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో నీటి పరీక్షలకు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): గ్రామీణ ప్రాంతాల్లో బోర్లలోని నీటిని పరీక్షలు చేసి, సురక్షిత తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని చంద్రగిరి ఎంపీపీ హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. చంద్రగిరి ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ప్రజలు సురక్షితమైన తాగునీరు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. బోర్లు, బావుల నీటిని ర్యాండమ్‌గా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతి పంచాయతీలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారని, దీని ద్వారా ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, నిరంజన్, సుమ పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి పునర్జన్మనిస్తుంది

- దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి జన్మదిన వేడుకలో మేయర్ శిరీష



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం: రక్తదానం మరొకరికి పునర్జన్మనిస్తుందని తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అన్నారు. తిరుపతి 11వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళికారెడ్డి జన్మదిన వేడుకలను తిరుపతి పెద్దకాపువీధిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మేయర్, డిప్యూటీ మేయర్ ప్రారంభించారు. ప్రతి మనిషి ఏదో ఒక సేవ చేసినప్పుడే ఆ పుట్టుకకు సార్థకం ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, గురువారెడ్డి, సుధాకర్‌బాబు, మునికృష్ణారెడ్డి, విజయేంద్రబాబు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం



చైర్మన్‌కు అన్నదానం విరాళమిస్తున్న అహిష్ రెడ్డి కుటుంబ సభ్యులు

తొట్టంబేడు (రేణిగుంట): శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి మంగళవారం నెల్లూరుకు చెందిన అహిష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి రూ.లక్ష విరాళాన్ని దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. స్వామి అమ్మవారి దర్శనాంతరం ఆలయ అధికారులు వారికి స్వామి, అమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.

మూడు ప్రమాదాలు.. ఐదుగురికి గాయాలు





కారును ఢీకొట్టడంతో దెబ్బతిన్న ఆటో, 108లో ఆస్పత్రికి వెళుతున్న క్షతగాత్రులు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండల పరిధిలో మంగళవారం ఒకే రోజు మూడు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

కారును ఢీకొట్టిన ఆటో

జాతీయ రహదారిపై కారును వెనుక నుంచి ఆటో ఢీకొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చిత్తూరు జిల్లా ఐరాల నుంచి వస్తున్న బాలకృష్ణ కుటుంబం తమిళనాడు నుంచి శ్రీవారి దర్శనం కోసం వస్తున్న అధికారులకు చెందిన కారును ఢీకొట్టింది. దీంతో ఆటోలోని బాలకృష్ణ, అనుప్రియ, రెయిన్‌లకు తీవ్ర గాయాలయ్యాయి.

కారును ఢీకొన్న లగేజీ వ్యాన్

చంద్రగిరిలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద కారును లగేజీ వ్యాన్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి నుంచి కాళెపెంట్లకు సిమెంట్ తీసుకెళ్తున్న వ్యాన్ తిరుమల నుంచి కర్ణాటకకు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లగేజీ వ్యాన్ బోల్తా పడింది. మూడు ప్రమాదాలపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు చంద్రగిరి సీఐ ఓబులేసు తెలిపారు.



లారీని ఢీకొన్న కంటైనర్



కారును ఢీకొని బోల్తాపడిన లగేజీ వ్యాన్

వైఎస్ రాజారెడ్డికి భూమన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి మంగళం: పులివెందులలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాత వైఎస్ రాజారెడ్డి 25వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన సమాధి వద్ద తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. గంట పాటు అక్కడే కూర్చొని తన రాజకీయ గురువు, గాడ్ ఫాదర్ వైఎస్ రాజారెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

వైభవంగా పర్వతాల గంగమ్మ జాతర

రేణిగుంట: మండలంలో కరంబాడి సచివాలయ పరిధిలోని తారకరామానగర్‌లో మంగళవారం వైభవంగా పర్వతాల గంగమ్మ జాతర నిర్వహించారు. రెండు రోజుల పాటు అమ్మవారికి విశేష పూజలు చేశారు. బియ్యపు ఆకర్ష్ రెడ్డి అమ్మవారికి సారెను సమర్పించారు.